# రామబాణం

'ఉజ్జోన్'

**అతను అందరికీ పరిచితుడు. కొందరికి కొరకరానికొయ్య. కొందరి ఇంటి దీపం పెట్టిన ఆపద్బాంధవుడు. రౌడీలకు రౌడీ! అతను కొట్టిన ఓ చెంపదెబ్బ 'రామబాణం' అని ఆ ఊరి తహసీల్దారు అనడం వెనుక ఉన్న కథే ఇది!**

"రేపీపాటికి శాంక్షన్ ఆర్డరు, నా చేతిలో ఉండాలి. అసలయితే ఈ క్షణాన్నే పట్టుకెళ్ళే వాణ్ణి. కొత్తవాడివి కనుక ఇరవైనాలుగు గంటలు టైమిస్తున్నాను"

"అసంభవం!"

"ఏది అసంభవం? లోను శాంక్షను చేయడమా, లేక రేపటిలోగా పూర్తి కావడమా?"

"మొదటిదే!"

"ఇదిగో చూడు నేననలే మంచోణ్ణి కాదు. తలచుకుంటే నిన్ను ఇక్కడే పాతేయగలను. మంచిగా చెబుతున్నాను వినుకో!"

"ఇంకో సారిలా నోటికొచ్చినట్లు పేలితే, అదే పని నేను చేయాల్సి ఉంటుంది!"

జీవితంలో మొదటిసారిగా భయపడ్డాడు చక్రధరరావు. ఆ మాటలలోని నిండుతనానికి, తొణకని ఆ వ్యక్తిత్వానికి, కళ్ళలోని ఆ నిశితత్వానికి. కొత్త మేనేజరు స్ట్రిక్ట్ మనిషని, పొగరుమోతు కూడానని విన్నాడు కాని, తనపరిధిని మించిపోగల సత్తా ఉంటుందనుకోలేదు. లోతుపాతులు చూసుకునే దాకా, చక్రం వేరే దిశలో తిప్పుదామనుకున్నాడు.

"సరే,ఎంత కావాలి నీకు?"

"అంత డబ్బు నీ దగ్గర ఉంటుందనుకోను!"

చక్రధరరావు చెంప ఛెళ్ళుమన్నట్లయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. మాటలు కరువయ్యాయి.

"అంటే!"

"నన్ను కొనగలిగే ఆస్తి నీ దగ్గర లేదు!"

"అంతటి మగాడివా?"

"కావలిస్తే చూసుకోవచ్చు."

"ఆఫ్టరాల్ పది వేలు పారేస్తే నీవంటి వాళ్ళు వీధి కుక్కల్లా తోకలాడించుతూ వెంటబడివస్తారు. అసలు నీ రేటెంతో సరిగ్గా చెప్పు!"

"బహుశా నీవు అలాంటి జాతివాడివై ఉంటావు?"

"నాకేం కర్మ? నేను డబ్బు విసిరేవాణ్ణి!",

"లంచం పుచ్చుకునేవాడు వీధి కుక్క అయితే, డబ్బు విసిరేసి పనులు చేయించుకునేవాడు వీధిలోని గజ్జి కుక్క. నా రేటు ఇంతకు ముందే చెప్పాను నీకందుబాటులో ఉండదని."

"చూడబ్బాయ్! నీవింకా అనుభవం లేని వాడివి! అభివృద్ధిలోనికి రావలసిన వాడివి. అసలు చెప్పాలంటే ఇంతగా నాతో ఎవరూ మాట్లాడలేదు. అంతటి ధైర్యం ఎవరికీ లేదు. పోనీలే గాని, నీ తండ్రి లాంటివాణ్ణి.."

"నాన్సెన్స్! నా తండ్రి నీలాగ కుష్ఠురోగిలా ఇలా విసిగిస్తే మెడబట్టి బయటకు నెట్టేవాడిని!"

"నోరు ముయ్యి! ఎన్ని గుండెలురా నీకు? నీ అంతు చూస్తాను!"

"ఐ సే గెటవుట్! నిన్ను బయటికి గెంటాల్సి ఉంటుంది!"

చక్రధరరావు కోపంతో ఊగిపోతూ బుసలు కొట్టుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

నింపాదిగా ఆ రోజు హెడ్ ఆఫీసు కరెస్పాండెన్సు చూడటంలో మునిగిపోయాడు మేనేజర్ సునీల్‌కుమార్.

"సార్" భయాన్ని అణగదొక్కుకుంటూ పీలగా అరచింది అకౌంటెంట్ శ్రీనివాసరావు గొంతు. "ఇంతకు ముందు మీతో గొడవ పడ్డ వ్యక్తి..."

"నాకు తెలుసు. కంట్రాక్టర్ చక్రధరరావు. చాలా పలుకుబడి కలవాడు" జంకెరుగని గొంతది.

"మీరతనితో గొడవ తెచ్చుకోవలసింది కాదు. అతను త్రాచుపాములాంటివాడు!"

"త్రాచుపాము నెలా ఆడించాలో తలలోని విషాన్ని ఎలా దించాలో నాకు అనుభవమే. మీరు వెళ్ళి మీ పని చూసుకోండి!"

* * *

"దండాలు దొరా!"

"నమస్కారం. చెప్పులు బయటనే విప్పి వచ్చారేం? చెప్పులతో లోపలికి రావచ్చు."

"మేం యానాదివోళ్ళం దొరా!"

"మీరెవరైనా నాకు ఒక్కటే! చెప్పులతో లోపలికి రావచ్చు."

"తప్పుగదా దొరా" చెంపలేసుకుని మరీ చెప్పాడు నరిసిగాడనే నరసింహులు.

"చూడండి ఇది ప్రభుత్వ బ్యాంకు. ఇక్కడ అంతా ఒక్కటే!"

"అహ! చెప్పుల్తో లోనకు రావండి."

"చెప్పులు లేకుండా నేను లోపలికి రానివ్వను!"

"తవరు మంచోలే దొరా" విధిలేనట్లు బయటకు వెళ్ళి, చెప్పులు తొడుక్కుని తడబడే నడకతో లోపలికొచ్చాడు నరసింహులు.

"కూర్చోండి" దాదాపు శాసించాడు సునీల్‌కుమార్.

మంత్ర ముగ్ధుల్లా కుర్చీలో ఒదిగి కూర్చున్నారు నర్సింహులు, అతనితో వచ్చిన ఈరన్న

"చెప్పండి!"

"పందుల పెంపకానికికి అప్పు దొరుకుద్దని పెసిడెంటుగారు పొరాలిచ్చి పంపినాడు దొరా! తమరు సల్లగా సూత్తే ఇంటిల్లిపాదీ నాలుగేళ్ళు నోటిలోకి పోనిత్తాము." ఒదిగొదికి బల్లమీద ఫారాలుంచాడు.

బారోవర్ ఇంటర్వ్యూ ముగించి, ప్రీశాంక్షన్ సర్వేకు అదే రోజు సాయంత్రం యూనిట్ దగ్గర కొస్తానని చెప్పి పంపించాడు సునీల్‌కుమార్.

* * *

"నిన్నెందుకు పిలిపించానో తెలుసా సునీల్?" అతనంటే అమితమైన అభిమానం గల రీజినల్ మేనేజర్ భండార్కర్ సున్నితంగా అడిగారు.

"ఊహించగలను సార్!"

"చక్రధరరావు నీ మీద ఫిర్యాదు వ్రాయడమే కాక, రాష్ట్ర ఆర్థిక మంత్రి ద్వారా ఫోను చేయించాడు. పై అధికారులతో సహకరించకుండా తల బిరుసుగా వ్యవహరిస్తున్నావని 'పనిష్మెంటు బదిలీగా మొత్తం బ్యాంకుకే తలనొప్పయిన ఆ బ్రాంచిలో వేశారు నిన్ను! అయినా నీ ధోరణి మారలేదు."

కొంతసేపు వారిద్దరి మధ్యా, నీతి, ధర్మమూ, లోకంపోకడ, మనుగడకు మార్గం వంటి విషయాలు నడిచాయి.


"చూడండి సార్! గతంలో రెండు బ్యాంక్‌లలో పనిచేసి నేను రాజీనామా చేశాను. ఒక బ్యాంకు నుండి బయటకు తోసేశారు. "గాద్గదికమయింది సునీల్ కుమార్ గొంతు. "ఇది ధర్మానికి, అధర్మానికి నిత్యం జరిగే పోరాటమే! నా ఆత్మ విశ్వాసం, మీ అండదండలు నన్నింతవరకూ వెన్నుతడుతూ వచ్చాయి. రేపటి మాటంటారా! అది భగంతునికే వదిలేశాను. ఒక రోజు నా ఋజుమార్గం సరియైనదని పై అధికారులు గుర్తిస్తారు సార్ నా కా నమ్మకం ఉంది."

"చక్రధరరావు ప్రపోజల్ శాంక్షన్ చేయకతప్పదు. ఈ విషయంలో నేను నిస్సహాయుణ్ణి."

"సరే సార్!"

* * *

"డాడీ! టీవీ ఎప్పుడు కొంటావు? పక్కింటి వాళ్ళకు




టీవీ, వీసీ.ఆర్ లున్నాయి. మనకు టీ.వీ. అయినా లేదు" మారాం చేస్తూ అడిగాడు కిరణ్.

"కొందాం నాన్నా. ఇంకో మూడు నెలలు ఆగు తప్పకుండా కొందాం."

"ఆ! కొనాల్సిందే! మూడేళ్ళుగా కొనలేనిది మూడు నెలల్లో కొంటారు" మూతి మూడు వంకరలు తిప్పి , దెప్పింది సరోజ.

గతంలో మూడు ఉద్యోగాలలో అందరితో ఘర్షణ పడి, తరచుగా బదిలీ అవుతూ పడిన కష్టాలతో విసిగి వేసారిన సరోజ ధోరణి, పక్కవాళ్ళతో పోల్చుకుని తమకు అటువంటివి కావాలని మారాం చేసే కిరణ్ అమాయకత్వం ఒక్కోసారి సునీల్‌కుమార్ ఆత్మవిశ్వాసాన్ని కుదిపి వేస్తుంటాయి.

తమ దుకాణం ముందుగా పోతున్న సునీల్‌కుమార్‌ను సాదరంగా ఆహ్వానించాడు గోవిందు. సంవత్సరం క్రితం బస్‌స్టాండులో సోడాలమ్మిన గోవిందు, ఈనాడు కూల్‌డ్రింకు షాపు యజమాని. ఫ్రిజ్, ఫాన్ సన్‌గ్లాస్ ఫర్నిచర్ల వైభవాన్ని జీవితంలో తొలిసారిగా చవిచూస్తున్న గోవిందుకు, సునీల్‌కుమార్ ఆరాధ్యదైవం.

"వ్యాపారం బాగా సాగుతోందా గోవిందూ?"

"తమ దయవల్ల వరవాలేదు సార్! ఈ బీదోన్ని కనికరించి ఓ కూల్‌డ్రింక్ తాగండి."

అతని ముఖం చూస్తే నిరాకరించాలనిపించలేదు. స్వచ్ఛమైన ఆత్మీయత అందులో తొణికిసలాడుతోంది. ఒక

గోల్డ్‌స్పాట్ తాగి అవీ ఇవీ మాట్లాడి అలవాటుగా డబ్బివ్వబోయాడు.

"సామీ, తమరు చాలా నిక్కచ్చి మడినని తెలును. ఈ ఒక్క సారికి తమరు డబ్బులియ్యొద్దు. నీ సొంత మడిసిననుకొని ఈసారికి వదిలేయండి."

గోవిందు అభ్యర్థన నిరాకరించలేకపోయాడు. కేజువల్‌గా స్వీకరించడం ఆఫీసర్ల కు విరుద్ధం కాదని కాదు. ఆ సమయంలో పట్టుబడితే అది మానవత్వాన్ని వెక్కిరించడం అవుతుంది. మనిషిలోని ప్రతిస్పందనను తూకం వేయడంలో "ఎలక్ట్రానిక్ బేలన్స్" లాంటి వాడు సునీల్‌కుమార్.

* * *

తనకీసారి తలవంచక తప్పదని విజయ గర్వంతో లోపలికొచ్చిన చక్రధరరావుకు మళ్ళీ ఆశాభంగం ఎదురయింది.

"కూర్చోండి" చాలా నింపాదిగా చెప్పాడు సునీల్‌కుమార్.

"ఏమోయ్ మైకందిగిందా?"

"మర్యాదగా మాట్లాడడం మానవుల లక్షణం. మీ లోను శాంక్షన్ అయింది. పత్రం మీద సంతకం పెడితే రిలీజ్ చేస్తాను." స్థాయి తగ్గని ఆత్మస్థైర్యం. అదే నిండుదనం.

"ఊ! ఇంకా నీ పొగరు తగ్గలేదన్నమాట! చూస్తాను" సంతకం చేసి, లోను రిలీజ్ చేయించుకుని మీసం మెలివేస్తూ ఠీవిగా పోయాడు చక్రధరరావు.

హత్యలకూ, గూండాయిజానికీ పేరువడ్డ ఆ ఊళ్ళో రెండేళ్ళలో తన వ్యక్తిత్వపు సామ్రాజ్యాన్ని స్థిరంగా స్థాపించాడు సునీల్‌కుమార్. స్నేహితుడుగా, వేదాంతిగా, మార్గదర్శకునిగా అందరికీ సుపరిచితుడు. కొందరికి కొరకరాని కొయ్య. కొందరి ఇంట దీపం పెట్టిన ఆపద్బాంధవుడు. రౌడీలకు రౌడీ! మరికొందరికి నమ్మలేనినిజం. ఎటువంటి పరిస్థితులలోనూ చలించని ఆత్మస్థైర్యం. అందరినీ శాసించగల మహోన్నత వ్యక్తిత్వమది! దాని ముందు కులమూ, అంతస్తూ, ఐశ్వర్యం, హోదా, పలుకుబడీ అన్నీ తల వంచాల్సిందే!

నెమ్మదిగా ఆ బ్రాంచి వాతావరణాన్ని ఊరివాళ్ళ మనస్తత్వాల్ని మరమ్మతు చేయసాగాడు. ముఖ్యంగా పదిహేనేళ్ళుగా పాతుకుపోయిన, జిడ్డుకట్టిన లోను ఖాతాలను, సామదాన, భేద దండోపాయాలతో దారికి తెచ్చాడు, ఒక దాని తర్వాత ఒకటిగా. సునీల్‌కుమార్ మొండిగా వ్యవహరించేది ఒకే ఒక విషయంలో సమస్యా పరిష్కారంలో. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం తప్పకుండా ఉంటుంది కనుక దాన్ని అందుకుని తీరాలన్నదే అతని పట్టుదల. ఏ డాక్టరయినా వ్యాధి నిర్ణయం చేశాక, వ్యాధి ఒకటే అయినా అందరికీ ఒకే చికిత్స చేయడు. కొందరికి కేవలం మాత్రలు, కొందరికి ఇంజెక్షన్, కొందరికి ఆపరేషన్. చాలా అరుదుగా ఎంప్యుటేషన్. సరిగ్గా ఇదే సిద్ధాంతం "స్టికీ ఎడ్వాన్సెస్" రికవరీలో ఉపయోగపడుతుంది. దానికి డయాగ్నొసిస్ పద్ధతే. "కేస్ బైకేస్ ఎనాలిసిస్" అంటే ఒకే రకం రెండు కేసుల్లోనూ ఒకే రకం వసూలు పద్ధతి ఉండదు. ప్రతి కేసునూ క్షుణ్ణంగా చదివి, తగిన స్ట్రాటజీస్‌తో ప్రతి అడుగూ తూచి వేస్తూ, పర్యవసానాలను జాగ్రత్తగా విశ్లేషించి తరువాతి చర్యలను నిర్ణయించడం అందులోని ముఖ్యాంశం.

ఈ విషయంలో సునీల్‌కుమార్ సిద్ధహస్తుడు. తన నమ్మకాలను నిరూపిస్తూ ఆ శాఖలోని నలభై అయిదు శాతం ఓవర్‌డ్యూస్‌ను ఇరవై శాతానికి తగ్గించాడు. అంతేగాక డిపాజిట్లను కూడా తను చేరినప్పటికంటె రెట్టింపు చేశాడు. హెడ్డాఫీసునుంచి, రీజినల్ ఆఫీసునుంచి ప్రశంసలు చెబుతూ లేఖలు వస్తున్నాయి. బ్యాంకు విషయాలే గాక ఊరివిషయాలను కూడా. సరియైన మార్గంలోకి తేగలిగాడు. సామాజిక స్పృహతో నైతిక బాధ్యతలను సైతం నిర్విరామంగా నిర్వర్తించేవాడు.

* * *

పోస్టు శాంక్షన్ ఫాలో అప్‌కు పోతున్న సునీల్ కుమార్‌ను వృద్ధురాలైన పోలమ్మ నిలిపింది. పాడిగేదెలకు అప్పిచ్చి ఆమెకు మంచి జీవనోపాధికల్పించినందుకు ఆమెకు సునీల్‌కుమార్ పెద్ద దిక్కు. తన ఒక్కగానొక్క కొడుకు గోడు వినిపించింది.

"చూణ్ణాయనా! కలో గంజో తాగి, ఉన్నదమ్మి నది విత్తంటే ఈడు కాలేజీ ఎగ్గొట్టి సిలమాలు, పోసుకోలు స్నేహాలు. సదువు పూర్తిగా సంకనాకిపోయింది! కాస్త సెప్పు నాయనా!" 'ఏమి'టన్నట్లు చూశాడు. సునీల్‌కుమార్ రాజా వంక.

"పోవోయ్! నువ్వెవడివి నాకు చెప్పటానికి? నీ అధికారం బ్యాంకులో. ఇక్కడ కాదు."

కుమార్ రాజా చెంప చెల్లుమంది. ఎంత బలంగా పడిందంటే ఆ దెబ్బకు తూలి పోలమ్మ కాళ్ళ దగ్గర పోయి పడ్డాడు.


"రాస్కెల్! పిచ్చి వేషాలేశావంటే ఒళ్ళు హూనం చేస్తాను. జాగ్రత్త! నీ పిచ్చి వేషాలుమాని సరియైన మార్గానికి వచ్చిందాకా నీ శరీరం మీద నాకు సంపూర్ణాధికారాలుంటాయి. గుర్తుంచుకో!" కంగుమంది సునీల్ గొంతు.

కోపం, పగలకుబదులుగా ఆశ్చర్యం, ఆత్మీయత కలుగగా, బొటబొటా కన్నీరు కార్చాడు కుమార్ రాజా.

"చూడు బాబూ! కాలరెత్తుకుని వీధులలో తిరిగి పనికిరాని పనులు చేయడంలో గొప్పతనం ఏమీ లేదు. ఏ వెధవయినా చేసేదదే! ప్రతి వెధవా అదే పని చేస్తున్నాడు కూడా! నీలో గొప్పతనం ఏదైనా ఉంటే అది చూపించాల్సింది నీ బాధ్యత నిర్వర్తించడంలో. నీ మీద ఆశలు పెట్టుకుని సర్వాన్నీ ధారపోస్తున్న. మీ అమ్మ ఆశయాలు నెరవేర్చడంలో!" వెన్ను తట్టుతూ మృదువుగా చెప్పాడు.

అక్కడే తిరిగిందొక మలుపు కుమార్ రాజా జీవితంలో. ఊహించలేని భవిష్యత్తుకు. దీన్నే సునీల్‌కుమార్ 'హార్డ్ అండ్ సాఫ్ట్' అప్రోచ్ అంటాడు. పచ్చి పాలను పాశ్చరైజేషన్ ద్వారా వేడి చేసి, వెంటనే చల్లార్చడం ద్వారా పాలలోని బాక్టీరియా నశించి పాలకు చెడిపోకుండా స్థిరత్వం ఏర్పడుతుంది. మానవ నైజం కూడా అంతే.

కాలగర్భంలో నాలుగు సంవత్సరాలు



కలిసిపోయాయి. ఈ నాలుగు సంవత్సరాలలో ఆ ఊళ్ళో చాలా మార్పులు వచ్చాయి. కథల్లో లాగా సునీల్ కుమార్‌కు అన్నీ సవ్యంగా నడిచాయని గాదు. ఎన్నో వ్యతిరేకతలు. ఎంతో మంది పగవాళ్ళు. అయితే అన్నీ కొనితెచ్చుకున్నవే. కాని సునీల్‌కుమార్ మీద ఒక కర్ర లేస్తే జవాబుగా పది కర్రలు రంగప్రవేశం చేస్తాయి. పచ్చి నెత్తురు తాగే వాళ్ళతో బాటు వెచ్చటి నెత్తురుతో సునీల్‌కుమార్ పాదాలను అభిషేకం చేయగలవాళ్ళు కూడా ఉన్నారు. ఈ రకం విభిన్న పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ అందరినీ ఒకే తాటి మీద నిలువగలిగాడు. ఈ నాలుగేళ్ళలోని అతిముఖ్యమైన మార్పులు రెండు. ఒకటి అధికార పక్షం ఎన్నికలలో ఓడిపోవడం వలన చక్రధరరావుకు అండ లేకుండా పోయింది. కాంట్రాక్టులు సరిగా నిర్వర్తించకపోవడం వలన ఆస్తి, పలుకుబడి పడిపోయినాయి. రెండవది సునీల్‌కుమార్ చేతి చలవ వలన దారి మార్చుకున్న కుమార్‌రాజా [పేరు చంద్రమోహన్] బికాం సెకండ్ క్లాసులో పాసయి, నిమ్నకులస్థుడు కావడాన రిజర్వేషన్‌లో, ఆ ఊరికే తాసీల్‌దారుగా పోస్టు కావడం.

* * *

చక్రధరరావు అప్పులు తీర్చలేకపోవడాన ఆస్తి జప్తుకు వచ్చింది. ఓ రోజున లోగడ జప్తు చేయబోగా దౌర్జన్యానికి దిగినందున అరెస్టువారెంటుతో సహా పోలీసు బలగం దిగి, చేతులకుబేడీలు వేసిమరీ తీసుకెళ్ళారు. పనిమీద రీజినల్ ఆఫీసుకెళ్ళిన సునీల్‌కుమార్‌కు ఈ విషయం ఆలస్యంగా తెలిసింది. మరునటి రోజు తన జామీనుతో చక్రధరరావును విడిపించి తీసుకు వస్తున్న అతన్ని చూస్తే ఎంతటి దుర్మార్గుడికయినా కళ్ళు చెమర్చకమానవు.

"చూడండీ చక్రధరరావుగారూ! మీ మీద నాకు పగంటూ ఏమీ లేదు మీరు సరియైన మార్గంలోకి



వస్తే మీకు అండగా నిలుస్తాను. టి.వేడి ఇస్తాను. ప్రస్తుతానికి నిలదొక్కుకుని, నెమ్మదిగా కోలుకోండి. అయితే ఒక షరతు! నే చెప్పినట్లు కచ్చితంగా ఆర్థిక క్రమశిక్షణలో ఉంటేనే సహాయం చేస్తాను."

అలా చెబుతున్న సునీల్‌కుమార్ "ఈ రోజు అలసిపోయావు. నేడు పోయి తగిన ఆయుధాలతో రేపు యుద్ధానికి రా!" అని ఆఖరు దశ పోరాటంలో రావణునికి చెబుతున్న శ్రీరామచంద్రునిలా గోచరించాడు చక్రధరరావుకు.

అతన్ని నిలదొక్కుకునేలా చేసేటప్పటికి సునీల్‌కుమార్ బదిలీ. ఏ శాఖలో తను పనికి రాడని శిక్షగా ఇక్కడకుపంపారో, హెడ్డాఫీసులో మళ్ళీ అదే డిపార్టుమెంట్‌కు మేనేజర్‌గా వేశారు- అక్కడి పరిస్థితులు చేయి జారడంతో బలమైన చేయి కావాలంటూ, పై అధికార్లు చేతులు చాపారు సునీల్‌కుమార్ కోసం. లూజ్ హెడెడ్ నట్స్ కంటే, ముక్కుసూటి వాళ్ళే నయమని వాళ్ళకు జ్ఞానోదయమయింది.

వెళ్ళే ముందు ఆ ఊళ్ళో సునీల్‌కుమార్‌కు ఘనమైన వీడ్కోలు సభ జరిగింది. వద్దు మొర్రో అన్నా వినిపించుకోకుండా, కారు మీద సెట్టింగులతో అమర్చిన పూలరథంలో సునీల్‌కుమార్‌కు ఊరేగింపు జరిగింది. వీడ్కోలు సభలో జీవితంలో తొలిసారిగా కన్నీటిని అదుపులో పెట్టుకోవడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. తహసీల్దారు చంద్రమోహన్ వేదిక మీదకువచ్చి "నేనీ రోజున తహసీల్దార్ గావడానికి కారణం శ్రీ సునీల్‌కుమార్ గారి చెంప దెబ్బ" అంటూ తన జీవితం అనుకోని మలుపు ఎలా తిరిగిందో వివరించి చెప్పాడు.

ప్రేక్షకులలో కరతాళాలు దాదాపుపది నిముషాలు వినిపించాయి.

"అయితే నాకొకటే విచారం. ఆ రోజున వారి చేతికి ఉంగరమే ఉంటే దాని ముద్ర నాకు చిరస్థాయిగా దక్కేదేమో! ఇకముందు ఆ లోటు జరగరాదని వారికి ఈ ఉంగరం బహూకరిస్తున్నా"నంటూ వేలికొక ఉంగరం స్వయంగా తొడిగాడు. కానీ ఆ ఉంగరాన్ని తీసి చంద్రమోహన్ సఫారీ కోటు జేబులో వేయడాన్ని అతనుగాని, పక్కన ఉన్న వాళ్ళు కాని గమనించలేదు.

* * *

అప్పుడప్పుడూ సహనాన్ని కోల్పోయే సరోజ కూడా ఎంతో సంతోషించింది తనకలాంటి భర్త దొరికినందుకు. "సరూ! మరలా ఇదే ఊరికే బదిలీ అయితే బాధపడవు కదూ!"

"ఈ ఊరికే కాదు ఏ అడవికయినా మీతో ఆనందంగా వస్తానండీ!" కళ్ళు తుడుచుకుంది సరోజ.

సీతారాముల్లాంటి ఆ దంపతుల జీవితం ఎటువంటి ఒడుదుడుకులనయినా భరించగలదు.

★

